
సాక్షి అనంతపురం

గురువారం । 7 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి.



టమాట కిలో రూ.30

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.25 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

కేజీబీవీ టీచింగ్ పోస్టులకు కౌన్సెలింగ్ రేపు

అనంతపురం ఎడ్యుకేషన్: కేజీబీవీ టీచింగ్ పోస్టులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు తెలిపారు. జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టుల భర్తీలో భాగంగా మెరిట్ ఆధారంగా ఇటీవల ప్రాథమిక అర్హత జాబితాలోని అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిందన్నారు. ఆయా పోస్టులకు ఫైనల్‌గా ఎంపికై న అభ్యర్థుల మొబైళ్లకు సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి మెసేజ్‌లు పంపినట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న అభ్యర్థులు ఈనెల 8న సమగ్ర శిక్ష కార్యాలయంలో జరిగే నియామక కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఒరిజినల్ గుర్తింపు కార్డు (ఆధార్) తీసుకురావాలని సూచించారు.

'జాతీయ లోక్ అదాలత్'ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కోర్టుల్లో డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జి. శ్రీనివాస్ సూచించారు. అనంతపురం జిల్లా కోర్టులోని తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ ఇచ్చే తీర్పులు సుప్రీం కోర్టు తీర్పులతో సమానమన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్‌ను ఏకకాలంలో నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 13 ప్రాంతాల్లో 26 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే న్యాయమూర్తుల నియామకం కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. గత లోక్ అదాలత్‌లో 6 వేల కేసులు పరిష్కరించామని, ఈ అదాలత్‌లో 5 వేల కేసులు పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. జాతీయ లోక్ అదాలత్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాజీ చేయదగిన కేసులన్నీ పరిష్కరిస్తామన్నారు. తీర్పు వల్ల కక్షిదారుడు ఒక్కరే విజయం సాధిస్తే.. లోక్ అదాలత్‌లో ఇరు వర్గాలు రాజీకావడంతో ఇరువురు విజయం సాధించినట్లేనని పేర్కొన్నారు. సివిల్ కేసుల్లో రాజీ పడితే కోర్టు ఖర్చులు వాపస్ చేస్తామని ఆయన తెలిపారు.

ఆరోగ్యశ్రీ చికిత్సల్లో మూడో వంతుకు పైగా కోతవేసి.. పేదల వైద్యం ఖర్చును భారీగా తగ్గించుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఆరోగ్యశ్రీకి కోట్లాది రూపాయలు వ్యయం చేయడం సరి కాదనే భావనలో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్టు తెలుస్తోంది. కేవలం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ (అభా) పథకంలో ఉన్న జబ్బులకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం కూడా చికిత్సలు అందించి, చేతులు దులుపుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం.



పేదలపై ఆరోగ్య భారం!

- సామాన్యుల వైద్యంపై వ్యయాన్ని తగ్గించాలని సర్కారు ఆలోచన
- కేంద్ర ప్రభుత్వ పథకాన్నే అమలు చేసేందుకు కసరత్తు
- 'అభా' పరిధిలో 1,949 ప్రొసీజర్లు మాత్రమే
- 'ఆరోగ్యశ్రీ' పరిధిలో 3,256 రోగాలకు వైద్యం
- ప్రభుత్వ చర్యలపై సామాన్యుల్లో తీవ్ర భయాందోళన
- మళ్లీ పాతరోజులొస్తాయని చర్చ
- ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రజలకు ఉచిత వైద్యం ప్రశ్నార్థకం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైఎస్ జగన్ సర్కారు హయాంలో 3,256 రకాల జబ్బులకు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా చికిత్సలందేవి. ఏ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లినా ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవలందించేవారు. కానీ.. ఇప్పుడు ఆయుష్మాన్ భారత్‌లో ఉన్న 1,949 జబ్బులకే చికిత్స అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని ప్రజలకు ఉచిత వైద్యం ప్రశ్నార్థకమవుతోంది.

1,307 చికిత్సల మాటేమిటి..?

'అభా' పరిధిలో ఉన్న 1,949 చికిత్సలను మినహాయిస్తే మిగతా 1,307 జబ్బులకు వైద్యం ఎలా అన్నదే సందేహంగా మారింది. ఈ వ్యాధులు అరుదుగా రావచ్చు కానీ వచ్చినప్పుడు మాత్రం ఆరోగ్యశ్రీలో ఎలాంటి ఆందోళన లేకుండా వైద్యం చేయించుకుంటున్నారు. కానీ, నేడు సాకులు చూపి పూర్తిగా ఎత్తేస్తే వైద్యానికి ఎక్కడికెళ్లాలని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా కరోనా, డెంగీ కేసులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చి పైసా ఖర్చు లేకుండా గత సర్కారు వైద్యం చేయించింది. కానీ, చంద్రబాబు ప్రభుత్వ చర్యల కారణంగా భవిష్యత్తులో పరిస్థితి ఏమిటన్నది అంతుచిక్కడం లేదు.

పాతరోజుల భయం..

2014–19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ సర్కారు ఆరోగ్యశ్రీని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్న విమర్శలు ఉన్నాయి. ఏపీలో క్యాన్సర్ చికిత్సకు అవకాశం లేకపోవడం, బయటి రాష్ట్రాల్లో చంద్రబాబు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం వంటి కారణాలతో అప్పట్లో ఎంతోమంది రోగులు మృతి చెందారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు నిధులు చెల్లించకపోవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది మంది వైద్యం అందక విలవిలలాడారు. ఇప్పుడూ అదే పరిస్థితి వస్తుందేమోనని భయపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఆరోగ్యశ్రీ వివరాలు ఇలా

జనాభా	42,00,000
ఆరోగ్యశ్రీలో చికిత్సల సంఖ్య	3,256
'అభా'లో అందించే చికిత్సలు	1,949
ప్రైవేటులో నెట్‌వర్క్ ఆస్పత్రులు	56
ప్రభుత్వ పరిధిలో నెట్‌వర్క్ ఆస్పత్రులు	96
ఆరోగ్యశ్రీ కింద ఏడాదికి లబ్ధిదారులు	1,90,000 వరకు
ఏడాదికి చేస్తున్న వ్యయం	రూ.300 కోట్లు
క్యాన్సర్, హార్ట్, ఆర్థో కేసులు	40 శాతం

యథావిధిగా కొనసాగించాలి



ఆరోగ్య శ్రీ సేవలు యథావిధిగా కొనసాగించాలి. కూటమి సర్కారు చికిత్సల సంఖ్యను తగ్గించాలనే ఆలోచన సరి కాదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సేవల్లో ఒక్కటి కోతకు గురైనా పేదలకు ఇబ్బందులు తప్పవు. ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు కొరవడ్డాయి. వైద్యం కోసం పేదలు ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ హయాంలోనూ ఆరోగ్య శ్రీ సేవలు అటకెక్కించారు.

– శారద, అంబేద్కర్‌కాలనీ, రాయదుర్గం

ప్రభుత్వ నిర్ణయం సరికాదు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు సక్రమంగా అందేవి. దాదాపు 3,300 వ్యాధులకు విస్తరింపజేసి పేద ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ చికిత్సల సంఖ్యను కుదించాలని చూడటం సరికాదు. యథావిధిగా సేవలు కొనసాగిస్తే పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. లేకుంటే మోయలేని భారం పడటం ఖాయం. కూటమి సర్కారు నిర్ణయం అన్యాయం.

– భాస్కర్ రెడ్డి, శింగనమల

పీఏబీఆర్ సామర్థ్యం పెంపునకు చర్యలు

- కలెక్టర్ వినోద్‌కుమార్





మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, పాల్గొన్న అధికారులు

అనంతపురం సెంట్రల్: పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్) సామర్థ్యం పెంచేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం నగరంలోని బుడ్డప్పనగర్‌లో హెచ్చెల్సీ భూసేకరణ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన పీఏబీఆర్ భూసేకరణ, నిధులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కూడేరు మండల పరిధిలో ఉన్న పీఏబీఆర్ నీటి నిల్వ సామర్థ్యం 11.10 టీఎంసీలకు పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన భూసేకరణ చేయాలన్నారు. దాదాపు 3,026 ఎకరాల భూమి కావాల్సి ఉందన్నారు. ఉరవకొండ మండలంలోని మైలారంపల్లి, పెద్ద కౌకుంట్ల, రాకెట్ల, బెళుగుప్ప మండల పరిధిలో కోనంపల్లి, బూదిగుమ్మ, అంకంపల్లి, కూడేరు మండలంలో ఎంఎంహళ్లి, జయపురం, కొర్రకోడు గ్రామాల పరిధిలో భూసేకరణ చేపట్టాల్సి ఉందని అధికారులు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ.. వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. జలవనరులశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి త్వరలోనే లేఖ రాస్తానని తెలిపారు. సాంకేతిక సమస్యలు ఎలా అధిగమించాలనే అంశంపై అధ్యయనం చేయాలని సూచించారు. పీఏబీఆర్‌లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేస్తే వేలాది మంది రైతులకు లబ్ధి కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, హెచ్చెల్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమేష్‌రెడ్డి, డీటీ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

అనుకున్నట్టే జరిగింది!

- మునిసిపల్ హెచ్‌ఎంల పదోన్నతుల ప్రక్రియ వాయిదా



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: మునిసిపల్ స్కూళ్లలోని ప్రధానోపాధ్యాయుల పోస్టుల పదోన్నతుల కౌన్సెలింగ్ అంశం అనుకున్నట్టే వాయిదా పడింది. విద్యాశాఖ వద్ద ఎలాంటి వివరాలు లేకపోవడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నగరపాలక సంస్థ ఒక యూనిట్‌గా, ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీలు ఒక యూనిట్‌గా పదోన్నతులు చేపట్టాల్సి ఉంది. మునిసిపల్ స్కూళ్లల్లో పని చేస్తున్న టీచర్ల పదోన్నతుల ప్రక్రియను తొలిసారి విద్యాశాఖ చేపట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం షెడ్యూలు విడుదల చేశారు. అయితే, విద్యాశాఖ వద్ద మునిసిపల్ టీచర్లకు సంబంధించి ఎలాంటి వివరాలు లేవు. సంబంధిత మునిసిపల్ ఆర్డీకి లేఖ రాసినా కనీస సమాచారం అందలేదు. తూతూమంత్రంగా పాత సీనియార్టీ జాబితాను ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరించారు. కుప్పలుతెప్పలుగా అభ్యంతరాలు వచ్చాయి. వాటిని సరిచేసినా...ఆయా టీచర్లకు సంబంధించి మునిసిపల్ ఆర్డీ నుంచి ఎలాంటి వివరాలు రాలేదు. ఈలోగా హెచ్‌ఎం పదోన్నతుల కౌన్సెలింగ్ తేదీ రానే వచ్చింది. ఏం చేయాలో దిక్కుతెలియని విద్యాశాఖ అధికారులు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇంతమాత్రానికి అంత ఆర్భాటమా? అని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఏటా పదోన్నతులు కల్పిస్తున్నారని, మునిసిపల్ టీచర్ల విషయంలో శీతకన్ను చూపుతున్నారంటూ వాపోతున్నారు. చివరగా 2021 డిసెంబరులో పదోన్నతులు కల్పించారు. దీనిపై డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ మునిసిపల్ ఆర్డీ నుంచి వివరాలు అందని కారణంగానే పదోన్నతుల కౌన్సెలింగ్ వాయిదా వేసినట్లు తెలిపారు. కాగా ఈ సమస్య కారణంగానే రాష్ట్ర వ్యాప్తంగా మెజార్టీ జిల్లాల్లో కౌన్సెలింగ్ వాయిదా పడిందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెప్పారు.

షెడ్యూల్ ప్రకారం పదోన్నతులు చేపట్టాలి..

పురపాలక, నగరపాలక పాఠశాలల టీచర్ల పదోన్నతుల ప్రక్రియ షెడ్యూల్ ప్రకారమే నిర్వహించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. చాలా ఏళ్ల తర్వాత పదోన్నతులు చేపడుతున్నారని, ఆలస్యం కాకుండా వెంటనే జరిగేలా చూడాలని కోరారు. గతంలో రోస్టర్ ఎక్కడ ఆగిందో ఆర్జేడీఎంఏ రికార్డులు పరిశీలించి అక్కడి నుంచి కొనసాగించేలా చూడాలన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు, నాయకులు సూర్యుడు, చంద్రశేఖర్, అజయ్‌కుమార్, ప్రభాకర్, వన్నూరప్ప, మల్లికార్జున, యుగంధర్, మురళీకృష్ణ, విరూపాక్షగౌడ్, రామకృష్ణ, నౌషాద్, కలీముల్లాఖాన్ ఉన్నారు.



భావ ప్రకటనపై ఉక్కుపాదం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హక్కులను హరిస్తోంది. ప్రశ్నించే వారిపై ఉక్కుపాదం మోపుతోంది. హామీలు అమలు చేయాలంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన పాపానికి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేయిస్తోంది. సోషల్ మీడియా పోస్టులపై అరెస్టులు తగవని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా లెక్కచేయడం లేదు. అధికారం అండతో పోలీసులను ఉసిగొల్పి తీవ్రంగా వేధిస్తోంది. తద్వారా తమను ప్రశ్నించే వారందరికీ ఓ హెచ్చరిక జారీ చేస్తోంది. పౌరహక్కులపై కూటమి సర్కార్ చేస్తున్న దాడిని ప్రజాస్వామికవాదులు తప్పుబడుతున్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన పాలకులే తూట్లు పొడవడం తగదని హితవు పలుకుతున్నారు.

– సాక్షి, బృందం

ప్రశ్నిస్తే... అరెస్టులే

- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా టార్గెట్
- అమాయకులపై పోలీసులను ఉసిగొల్పిన ప్రభుత్వం
- ప్రభుత్వ చర్యలను తూర్పారబడుతున్న ప్రజాస్వామికవాదులు

ఇంట్లోంచి లాక్కెళ్లారు



నేను బుధవారం మధ్యాహ్నం కూలి పనుల నుంచి ఇంటికొచ్చే సరికి పోలీసులు నా కుమారుడు అంజనేయులు (అంజి వాల్మీకి)ను లాక్కెళ్తున్నారు. ఎందుకని అడిగితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టాడని చెబుతున్నారు. అడ్డుకోబోయిన నన్ను వృద్ధురాలని కూడా చూడకుండా పక్కకు నెట్టేశారు. నా బిడ్డను ఏం చేస్తారోనని భయంగా ఉంది. నా బిడ్డలాగే రాష్ట్రంలోని జనమంతా చంద్రబాబును అడుగుతున్నారు..వారందరినీ అరెస్టు చేస్తారా..?

– శంకరమ్మ, కె పూలకుంట, నల్లచెరువు మండలం

అక్రమంగా అరెస్ట్ చేశారు



నా కుమారుడు అమరనాథ్‌రెడ్డి బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. 'పోలవరం కట్టడం అసాధ్యం' అని ప్రపంచ బ్యాంక్ చెప్పిన విషయాన్ని నా కుమారుడు సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇందులో ఏం తప్పుంది..? అయినా అధికార పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడాడని రెండు రోజుల క్రితం పోలీసులు తప్పుడు కేసు పెట్టి అరెస్ట్ చేశారు. బెయిల్‌పై బయటకు రాగా, సెల్‌ఫోన్ ఇస్తామని ఈ రోజు మళ్లీ స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఇది మంచిది కాదు. ఇప్పటికైనా అక్రమ అరెస్టులు ఆపాలి.

– గంగిరెడ్డి, వీరచిన్నయ్యగారిపల్లి, కదిరి మండలం

అరెస్టులు దుర్మార్గం



రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. పోలీసులు కూడా టీడీపీ నేతల రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. నా కుమారుడు బాలాజీరెడ్డి 2022లో చంద్రబాబుపై ఏదో పోస్టు సోషల్ మీడియాలో పెట్టాడని రెండు రోజుల క్రితం అర్ధరాత్రి వేళ పోలీసులు మా ఇంటికి వచ్చారు. మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేసి బాలాజీని తీసుకువెళ్లి ఐటీ యాక్ట్ కింద కేసు పెట్టారు. టీడీపీ నాయకులు పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే అడ్డుకున్నందుకే కేసులు పెట్టి బెదిరించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రశ్నిస్తే అరెస్టు చేయడం దుర్మార్గం.

– వెంకటరామిరెడ్డి, నాగిరెడ్డిపల్లి, రొద్దం మండలం

హక్కులను హరిస్తున్నారు



ప్రతి ఒక్కరికీ భావ ప్రకటన హక్కు ఉంటుంది. దాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. కానీ ఈ ప్రభుత్వాలే హక్కులను కాలరాస్తున్నాయి. సోషల్ మీడియా పోస్టులపై అరెస్టు తగదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా రాష్ట్రంలోని పోలీసులు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సోషల్ మీడియా వేదికగా నా భర్త మెగా అంజాద్ ప్రశ్నించారు. దీన్ని సహించలేక పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించారు. నా భర్త లాగే ఎందరో సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఇది ముమ్మాటికీ పౌర హక్కులపై దాడే. ప్రభుత్వ చర్యలను న్యాయపరంగా ఎదుర్కొంటాం.

– మునవర్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ మెగా అంజాద్ భార్య

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?



ఎన్నికల ముందు అలివిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబును...ఆ హామీలను అమలు చేయమని ప్రశ్నించినందుకు మాపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. చంద్రబాబు హామీలు గుర్తు చేస్తూ వాటిని అమలు చేయాలంటూ కేవలం వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు పెట్టిన నాపై కళ్యాణదుర్గం అర్బన్ పోలీసు స్టేషన్‌లో పి.శ్రీరాములు అనే టీడీపీ కార్యకర్త కేసు పెట్టారు. ప్రశ్నించడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ఇలాంటి కేసులకు భయపడేది లేదు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చేదాకా ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం.

– లక్ష్మణ మూర్తి, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త, శెట్టూరు

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్ట్

నల్లచెరువు: ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పాపానికి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కె.పూలకుంటకు చెందిన పిచ్చుక ఆంజనేయులు (అంజి వాల్మీకి) వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తగా ఉంటున్నారు. రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలంటూ గతంలో ఓ పోస్టు పెట్టాడు. తాజాగా బుధవారం నల్లచెరువు పోలీసులు కె.పూలకుంటలోని పిచ్చుక ఆంజనేయులు ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో అతను కూలి పనులు చేసేందుకు పొలం వెళ్లగా... మధ్యాహ్నం వరకూ వేచి చూశారు. ఆంజనేయులు ఇంటికి రాగానే అదుపులోకి తీసుకుని కదిరి డీఎస్పీ కార్యాలయానికి తరలించారు.



అంజి వాల్మీకి

కామెంట్ చేసినందుకు...

ఉరవకొండ: కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు కామెంట్ పెట్టిన బెళుగుప్ప మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన సంజీవరెడ్డిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. బాధితుడి తల్లి సుంకమ్మ తెలిపిన వివరాల మేరకు.. పుట్టపర్తికి చెందిన ఓ యువకుడు సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు. బెళుగుప్ప మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన సంజీవరెడ్డి సదరు పోస్టును ట్యాగ్ చేసి కామెంట్ చేశాడు. దీంతో పుట్టపర్తి పోలీసులు బుధవారం బెళుగుప్పకు చేరుకుని ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇంటి వద్ద నుంచి నేరగాడిలా ప్రత్యేక వాహనంలో పుట్టపర్తికి తరలించారు. తన కొడుకును ఎందుకు తీసుకెళుతున్నారో చెప్పండి అంటూ తల్లి సుంకమ్మ కాళ్లావేళ్లా పడినా పోలీసులు కరుణించలేదు.

క్లుప్తంగా

సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయం, పరస్పర సహకారంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా పరిషత్ సీఈఓ ఎల్.వెంకటసుబ్బయ్య అన్నారు. 'పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన' అంశంపై రెండు రోజులుగా ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో నిర్వహించిన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఈఓ మాట్లాడుతూ... పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు ఎలా రూపొందించాలన్న అంశాన్ని వివరించారు. ప్రజావసరాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. నిధుల సమీకరణపై అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ ఆదాయ వనరులను పెంచుకునే మార్గాలను అన్వేషించాలన్నారు. రహదారుల పొడవునా, ఖాళీ ప్రదేశాల్లో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటి పెంచి పోషించాలన్నారు. అనంతరం పలు అంశాలపై డీఎల్‌డీఓలు లలితాబాయి, నాగేశ్వరరావు, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ అవగాహన కల్పించారు. ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మట్కా.. మాయ!



- అనంతపురం పాతూరు, తాడిపత్రి, కర్ణాటక సరిహద్దుల్లో జోరుగా మట్కా
- చిన్నాభిన్నమవుతున్న పేద, మధ్యతరగతి బతుకులు
- బానిసలుగా మారి పొలాలు అమ్ముకుంటున్న రైతులు

జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన రమేష్... తనకున్న పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే మట్కాకు బానిస కావడంతో పొలం కాస్త కరిగిపోతూ వచ్చింది. చివరకు కుటుంబసభ్యులు ఒత్తిళ్లకు తలొగ్గి అనంతపురానికి వలస వచ్చి ఓ హోటల్‌లో సర్వర్‌గా చేరాడు. ఇక్కడ కూడా తన సంపాదన మొత్తం 'మెయిన్ ముంబై' మట్కాలో పెట్టి నష్టపోయాడు. మట్కా నుంచి ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా గెలవలేదు. చివరకు అప్పుల పాలై వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక గ్రామంలో చివరకు మిగిలిన ఎకరా పొలాన్ని కూడా అమ్మేశాడు. .... ఈ పరిస్థితి రమేష్ ఒక్కరిదే కాదు. జిల్లా వ్యాప్తంగా వందలాది కుటుంబాలు మట్కా మహమ్మారి బారిన పడి చిన్నాభిన్నమయ్యాయి.... ఇప్పటికీ అవుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజల సంపాదన మొత్తం మాయదారి మట్కానే మింగేస్తోంది. జిల్లాలోని కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది.


ఈ వృత్తంలో కనిపిస్తున్న వ్యక్తి ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగున ఉన్న కర్ణాటకలోని భక్తులు ఇలవేల్పుగా కొలిచే నేమకల్లులోని ఆంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త. పేరు కె.హనుమంతప్ప. మట్కా రాయడాన్ని వృత్తిగా ఎంచుకున్న ఆయన... ఏకంగా ఆలయంలో తనకు కేటాయించిన గదినే కేంద్రంగా చేసుకుని చట్ట విరుద్ధంగా మట్కా రాస్తూ గత నెల 18న పోలీసులకు పట్టుబడ్డాడు. అయితే ఆయన టీడీపీ నేత కావడంతో తదుపరి చర్యలు తీసుకోవడంలో ఇటు దేవదాయశాఖ, అటు పోలీసు యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తున్నట్లు తెలిసింది.

అనంతపురం: మట్కా జూదం కేవలం జిల్లా సరిహద్దు గ్రామాల్లోనే కాక... జిల్లా కేంద్రంలోనూ ఊపందుకుంది. జిల్లా నుంచి రోజుకు సగటున పది వేల మంది మట్కా జూదం ఆడుతున్నట్లు సమాచారం. అనంతపురంలోని పాతూరు, గంగాగౌరీ థియేటర్, బళ్లారి బైపాస్, కళ్యాణదుర్గం రోడ్డు, రుద్రంపేట బైపాస్‌తో పాటు గుంతకల్లు, గుత్తి, పామిడి, రాయదుర్గం, బొమ్మనహాళ్, కణేకల్లు, ఉరవకొండ, తాడిపత్రి పట్టణాల్లో జోరుగా విస్తరించింది. ఈ జూదానికి చట్టబద్ధత ఉన్న మహారాష్ట్రలోని ముంబయి కేంద్రంగా మెయిన్ ముంబై, రాజధాని నైట్, న్యూముంబై దబ్రా, సెంట్రల్ ముంబై, శుభలక్ష్మి, న్యూవర్లీ, రాజధానిడే, కల్యాణి.. తదితర పేర్లతో వందకు పైగా కంపెనీలు రేయింబవళ్లూ తేడా లేకుండా మట్కా జూదం నిర్వహిస్తున్నాయి. నిరుపేదలు, దినసరి కూలీలు, మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా జిల్లాలో మట్కా మహమ్మారి రోజురోజుకూ విస్తరిస్తోంది. చివరకు వ్యాపారులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు, యువత సైతం మట్కాకు బానిసలయ్యారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సాంకేతిక పరిజ్ఞానంతో...

ఒకప్పుడు ఓ చోట చేరి చీటీలపై నంబర్లతో సాగిన మట్కా దందా.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత బాగా విస్తృతమైంది. రూ.100కు రూ.8వేలు ఇస్తామంటూ అమాయకుల బతుకులను నాశనం చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్లలో యాప్‌లు, ఎస్ఎంఎస్‌ల స్థాయికి చేరింది. ఉన్న చోటు నుంచే బెట్టింగ్ కట్టే వెసులుబాటు ఉండడంతో చాలా మంది ఉద్యోగులు, యువత, కార్మికులు, కర్షకులు మట్కాకు బానిసలయ్యారు. నిర్వాహకుల బ్యాంక్ ఖాతాకు ఆన్‌లైన్‌లో తొలుత డబ్బు వేసిన తర్వాత మట్కా ఓపెనింగ్ నంబరో, ప్యానల్ నంబరో, జోడీ నంబరో చెబితే నోట్ చేసుకుంటారు. గెలిస్తే పందెం కాసినవాళ్ల బ్యాంకు ఖాతాలో నేరుగా డబ్బు జమ చేస్తారు.

ఉనికి చాటుకునే ప్రయత్నమే...

మట్కా మహమ్మారిని అరికట్టే అంశంలో జిల్లా పోలీసు యంత్రాంగం విఫలమైందనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు మట్కా బీటర్లను అరెస్ట్ చేసి ఉనికి చాటుకునే ప్రయత్నం చేయడం తప్ప పోలీసులు సాధించిన ప్రగతి అంటూ ఏదీ లేదనే విమర్శలున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొందరు ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే మట్కా మూడు పువ్వులు... ఆరు కాయలుగా విస్తరిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. వారం రోజుల క్రితం అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు మట్కా బీటర్లను అరెస్ట్ చేసి రూ.2.50 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలో మట్కా ఏ స్థాయిలో విస్తరించేందుకు చెప్పడానికి ఇదొక్క ఉదాహరణ మాత్రమే. తాడిపత్రికి చెందిన ఓ కింగ్‌పిన్ కర్ణాటకలోని హుబ్లీకి చెందిన మట్కా డాన్‌కు ఏజెంట్‌గా వ్యవహరిస్తూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ జూదాన్ని యథేచ్ఛగా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. సదరు కింగ్‌పిన్‌పై గతంలో పలు పోలీసు కేసులు నమోదయ్యాయి. అయినా ఆయనలో మార్పు రాలేదు. పోలీసుల పనితీరులో మార్పు వస్తే తప్ప మట్కా మహమ్మారి అంతం కాదనే వాదనలు జిల్లా వ్యాప్తంగా వినిపిస్తున్నాయి.

వృద్ధురాలి ఆత్మహత్య

ఉరవకొండ: మండలంలోని షెక్షానుపల్లి తండాకు చెందిన హేమక్క (66) ఆత్మహత్య చేసుకుంది. వివరాలు... 19 ఏళ్ల క్రితం భర్త మృతి చెందడంతో అప్పటి నుంచి హేమక్క మనోవేదనకు లోనై అనారోగ్యం బారిన పడింది. ఈ క్రమంలో గత నెల 29న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిన ఆమె ఆచూకీ ఆ తర్వాత లభ్యం కాలేదు. బుధవారం ఉదయం జరుట్ల రాంపురం వద్ద పొలాల్లో హేమక్క మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం నుంచి దుర్వాసన వెలువడుతుండడంతో దాదాపు వారం రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబసభ్యులూ అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, హేమక్కగా నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం

గుంతకల్లు రూరల్: సంతానం కలుగక పోవడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... గుంతకల్లులోని దోనిముక్కల రోడ్డులో ఉన్న ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న ఈశ్వర ప్రసాద్ (36)కు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నాడు. సంతానం కలగకపోవడంతో పలు ఆస్పత్రుల్లో దంపతులు చికిత్స చేయించుకున్నారు. అయినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు లోనైన ఈశ్వర ప్రసాద్ మంగళవారం అర్ధరాత్రి తన భార్య ఆదిలక్ష్మి నిద్రిస్తుండగా పురుగుల మందు తాగాడు. విషయాన్ని పసిగట్టిన ఆదిలక్ష్మి వెంటనే భర్తను గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఆగమేఘాలపై అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక బుధవారం సాయంత్రం ఈశ్వర్ ప్రసాద్ మృతి చెందాడు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

శింగనమల పీఎస్ వద్ద ఉద్రిక్తత



పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడిన ప్రజలు

శింగనమల: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రెండు గ్రామాలకు చెందిన ప్రజల మధ్య పెద్ద ఎత్తున తోపులాట జరగడంతో వారిని పోలీసులు చెదరగొట్టారు. వివరాలు... శింగనమల మండలం నిదనవాడ గ్రామంలో కొన్ని రోజులుగా వ్యవసాయ మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లు అపహరణకు గురవుతూ వచ్చాయి. దీనిపై బాధిత రైతులు ఫిర్యాదు చేసిన పోలీసుల నుంచి స్పందన కరువైంది. ఈ క్రమంలో తోటలపై రైతులు ప్రత్యేక నిఘా ఉంచారు. మంగళవారం రాత్రి తోటల్లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఆరుగురు యువకులను బంధించి వివరాలు ఆరా తీసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో వారు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో తమది పెద్దవడుగూరు మండలం గోపురాజుపల్లి గ్రామమని, కుందేళ్ల వేటకు వచ్చినట్లు సదరు యువకులు చెప్పుకొచ్చారు. బుధవారం ఉదయం విషయం తెలుసుకున్న గోపురాజుపల్లి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో శింగనమల పీఎస్‌కు చేరుకున్నారు. అప్పటికే తమ గ్రామంలో యువకులు సంచరించిన ప్రాంతంలో పడేసిన కటింగ్‌ప్లేయర్, కట్టర్‌ను తీసుకుని నిదనవాడ గ్రామ రైతులూ అక్కడకు చేరుకున్నారు. ఆ సమయంలో ఇరు గ్రామాల ప్రజల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని తోపులాటకు దారి తీసింది. దీంతో ఇరుగ్రామాల ప్రజలను ఎస్ఐ శరత్‌చంద్ర, సిబ్బంది చెదరగొట్టారు. అనంతరం ఇరుగ్రామాలకు చెందిన కొందరిని తన కార్యాలయానికి సీఐ కౌలుట్లయ్య రప్పించుకుని మాట్లాడి, లోతైన విచారణకు సహకరించాలని ఇరు గ్రామాల ప్రజలకు సర్దిచెప్పిపంపారు.

హెచ్‌ఏపై కేసు నమోదు

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం సచివాలయం-1 ఉద్యాన శాఖ అసిస్టెంట్ (హెచ్‌ఏ) నరేష్‌కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. 501 బస్తాల వేరుశనగ కాయలు, 30 కంది ప్యాకెట్లకు సంబంధించి వసూలైన రూ.5,28,483ను ఆయన తన సొంతానికి వాడుకున్నారు. రోజులు గడుస్తున్నా.. డబ్బు జమ చేయకపోవడంతో వ్యవసాయాధికారి జాఫర్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఓబుళపతి తెలిపారు.

మహిళలు స్వశక్తితో రాణించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రాప్తాడు: విద్యతోనే కుటుంబం బాగుపడుతుందని, ప్రతి మహిళా ఉన్నత చదువులు అభ్యసించి, ప్రభుత్వ కార్యక్రమాలను అందిపుచ్చుకుని స్వశక్తితో రాణించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆకాంక్షించారు. రాప్తాడు మండల పరిధిలోని టీటీడీసీలో ప్రశాంతి జిల్లా పరస్పర సహాయ సహకార సంఘాల ఫెడరేషన్ లిమిటెడ్ 20వ వార్షిక మహాసభ బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలతో మండల, జిల్లా సమాఖ్యలు ఏర్పాటు చేయడంలోను, మహిళలను సభ్యులుగా చేర్పించడంలో జిల్లా ముందు వరుసలో నిలవడం గర్వకారణమన్నారు. ఇలాంటి ఆనంద సమయంలో తన తల్లిను ఆయన గుర్తు చేసుకున్నారు. తన తల్లి కూడా మహిళలు ఎప్పుడూ చదువుకోవాలని, ఉద్యోగాలు చేయాలని, చదువుకుంటే గౌరవం వస్తుందని, ఆదాయం వస్తే వారి కాళ్లపై నిలబడతారని, సొంతంగా నిర్ణయం తీసుకునే శక్తి వస్తుందని చెబుతూ ఉండేదని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ విభేదాలు పక్కన పెట్టి సంఘంగా ఏర్పడి రుణాలు తీసుకుని అధికారులను సమన్వయం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఇందుకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు కావాల్సిన సహాయ, సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. మహిళలు బాగుంటే కుటుంబం బాగుంటుందని, తద్వారా గ్రామం, దేశం బాగుంటుందన్నారు. మహిళలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణానికి అవసరమైన రుణాలు ఇవ్వాలని, దీపం-2, ఉపాధి హామీ, ఇతర ప్రభుత్వ పథకాలపై సమావేశాలను జిల్లా, మండల, గ్రామ సమాఖ్యల్లో నిర్వహించి వాటి పట్ల అందరికీ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రశాంతి జిల్లా సమాఖ్య తరపున కలెక్టర్‌ను సంఘాల సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, ఐసీడీఎస్ పీడీ బి.ఎన్.శ్రీదేవి, ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు షేకూన్, ఉపాధ్యక్షురాలు సుజాత, రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజా, కార్యదర్శి రాధ, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిళ్లతో టీచర్లు సతమతం

- లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎన్ శిక్షణ వెంటనే రద్దు చేయాలి
- ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్


డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: శిక్షణల పేరుతో ప్రభుత్వం టీచర్లను తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు మండిపడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా అరిగిపల్లిలో జరుగుతున్న లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటరత్నకుమార్ గుండెపోటుతో మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన మానసిక ఒత్తిడి మూలంగానే ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. ప్రస్తుతం అందరూ ప్రధానోపాధ్యాయులు అపార్ నమోదు, పదో తరగతి పరీక్షల నామినల్ రోల్స్ ఫీజు చెల్లింపు కార్యక్రమాలలో బిజీగా ఉన్నారని, ఇలాంటి తరుణంలో శిక్షణల పేరుతో మానసిక ఒత్తిళ్లకు గురి చేయడం సబబు కాదన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్ సిరాజుద్దీన్, ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్, నాయకులు సర్దార్‌వలి, వెంకటరమణ, కలీముల్లా, హనుమంతు ఉన్నారు.

క్షణాల్లో ఆవిరైన ఆనందం

- రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన కుమార్తె
- పోటీలు ముగించుకుని మంగళవారం ధర్మవరానికి చేరుకున్న వైనం
- కుమార్తెను పిలుచుకెళుతుండగా ప్రమాదం
- ఘటనలో మృతి చెందిన విద్యార్థిని... తండ్రికి తీవ్ర గాయాలు


సాయి భవిత (ఫైల్)

పెనుకొండ రూరల్/పెనుకొండ: రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో రాణించిన కుమార్తెను చూసి ఆనందించిన ఆ తండ్రి సంతోషం క్షణాల్లోనే ఆవిరైంది. పోటీలను ముగించుకుని ధర్మవరానికి చేరుకున్న కుమార్తెను పిలుచుకుని ఇంటికి వెళుతున్న సమయంలో బొలెరో వాహనం రూపంలో మృత్యువు కబళించింది. విషయం తెలియగానే పెనుకొండలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాలు.... ధర్మవరానికి చెందిన రమేష్, మల్లిక దంపతులకు సాయి భవిత (15), తనుశ్రీ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రొద్దంలోని జెడ్పీహెచ్ఎస్‌లో రమేష్ పీఈటీగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో పెనుకొండకు తన నివాసాన్ని మార్చి రోజూ రొద్దం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి వచ్చేవారు. పెద్ద కుమార్తె సాయి భవిత పెనుకొండలోని శాంతినికేతన్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. హాకీపై మక్కువ చూపడంతో ఆమెను ఆ దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ వచ్చారు. ఈ క్రమంలో జిల్లా స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరిచి ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్టులో చోటు దక్కించుకుంది. దీంతో ఎంతో సంతోషపడిన తల్లిదండ్రులు ఆమెను నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు పంపారు. కుమార్తె ఆటతీరును ప్రత్యక్షంగా చూడాలనే ఆకాంక్షతో రమేష్ కూడా నెల్లూరుకు వెళ్లారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన సాయి భవితను జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఈ మొత్తం ప్రక్రియ ముగిసిన తర్వాత నెల్లూరు నుంచి రైలులో బయలుదేరిన వారు మంగళవారం అర్ధరాత్రి తర్వాత ధర్మవరానికి చేరుకున్నారు. బుధవారం ఉదయం కుమార్తెను పిలుచుకుని ధర్మవరం నుంచి ద్విచక్ర వాహనంపై రమేష్ పెనుకొండకు బయలుదేరారు. మార్గ మధ్యంలో పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన తండ్రి, కుమార్తెను స్థానికులు వెంటనే గుట్టూరులోని పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సాయి భవితను బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. రమేష్‌ను అనంతపురానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు కియా ఎస్ఐ రాజేష్ తెలిపారు. కాగా, సాయిభవిత మృతి విషయం తెలియగానే మంత్రి సవిత దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఓ మంచి విద్యార్థి, క్రీడాకారిణిని కోల్పోవడం బాధాకరమంటూ ఓ ప్రకటన విడుదల చేశారు.

అంత్యక్రియల నిర్వహణకు అగచాట్లు


ముళ్ల పొదల మధ్య నుంచి పెద్దక్క మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న దృశ్యం

యాడికి: మండలంలోని లక్షుంపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీ వాసులు మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించేందుకు నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. గత 50 ఏళ్లుగా ఇదే పరిస్థితి. శ్మశానికి వెళ్లే మార్గంలో ఉన్న నాలుగు అడుగుల మార్గం కుదించుకు పోవడమే కాక, మృతదేహాలను తరలించే ప్రధాన మార్గాన్ని రాళ్లతో మూసివేయడం ఈ పరిస్థితి నెలకొంది. తాజాగా బుధవారం ఓ వృద్ధురాలి అంత్యక్రియల నిర్వహణకు ఇక్కట్లు ఎదురవడంతో అధికారులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. వివరాలు... లక్షుంపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో నివాసముంటున్న పెద్దక్క (65) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది. గ్రామ సమీపంలో సర్వే నంబర్ 127-2లోని 20 సెంట్లలో ఎస్సీల శ్మశాన వాటికలో ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు కుమారులు రంగస్వామి, నిరంజన్ సిద్ధమయ్యారు. అయితే ఎస్సీ కాలనీ నుంచి శ్మశాన వాటికకు వెళ్లే మార్గాన్ని ఆ దారిలో ఉన్న పొలాల రైతులు రాళ్లతో మూసి వేశారు. దీంతో పెద్దక్క మృతదేహాన్ని ముళ్ల పొదల మీదుగా శ్మశానికి తరలించి ఖననం చేశారు. విషయాన్ని తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్, యాడికి ఎస్ఐ రమణ, పంచాయతీ సిబ్బంది బుధవారం ఉదయం లక్షుంపల్లికి చేరుకుని శ్మశాన వాటికకు వెళ్లే మార్గాన్ని, రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఆ మార్గంలో రైతులు అడ్డుగా వేసిన రాళ్లను తొలగించారు. అయితే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా అధికారులను స్థానిక ఎస్సీ కాలనీ వాసులు కోరారు.

సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా ప్రతాప్

అనంతపురం రూరల్: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా ప్రతాప్ సూర్య నారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ సెక్రటరీ కన్నబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని నెలల నుంచి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ డీడీగా బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి కొనసాగుతున్నారు. ఈ క్రమంలోనే కర్నూలు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీగా పని చేస్తున్న ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. నూతన డీడీ రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


వర్షిత

అనంతపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ (400 మీటర్లు)లో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎ.వర్షిత ఎంపికైంది. గుంతకల్లు మండలం నరసాపురం గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో ఆమె 9వ తరగతి చదువుతోంది. ప్రతిభ చాటిన విద్యార్థినిని ఆ పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాసులు, పీడీ చల్లా ఓబులేసు బుధవారం అభినందించారు.

రేపటి నుంచి సీపీఎం పోరుబాట


ప్రజాపోరు కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కారంలో కూటమి సర్కార్ అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకూ సీపీఎం పోరుబాట పట్టింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిర్ణీత తేదీల్లో ప్రజాపోరు పేరుతో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో ఆయన విడుదల చేసి, మాట్లాడారు. ధరల పెరుగుదలతో పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాలవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ధరల పెరుగదలను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు.

= తాము అధికారంలోకి వస్తే విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ ఎన్నికల సమయంలో నిరుద్యోగులను ఊరించిన కూటమి పెద్దలు... అధికారం చేపట్టిన తర్వాత ఆ విషయాన్ని పక్కన పెట్టారన్నారు. డీఎస్సీ వాయిదా వేశారన్నారు. గ్రూప్-1, గ్రూప్-2 నిర్వహణ అగమ్యగోచరంగానే ఉందన్నారు. దీంతో యువత నిరాశకు గురవుతోందన్నారు.

- రాష్ట్రంలో మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళ వ్యక్తం చేశారు. ఆచూకీ దొరకని ఆడపిల్లల సంఖ్య పెరుగుతోందన్నారు.
- కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అవినీతి పెరిగిపోయిందన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ఇసుక, మద్యం మాఫియా చెలరేగిపోయిందన్నారు. ఉచిత ఇసుక విధానం నేటికీ అమలుకు నోచుకోక భవన నిర్మాణ కార్మికులు, నిర్మాణదారులు, ర్యాంపుల్లో కార్మికులు, వాహన యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.
- విచ్చలవిడిగా మద్యం దుకాణాల నిర్వహణకు అనుమతులు జారీ చేయడం, వాటి నిర్వహణ సమయం పెంచడం, బెల్టు షాపులకు తెర తీయడం దుర్మార్గమన్నారు. మద్యాన్ని నియంత్రించాల్సిన ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజల ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని కొల్లగొట్టే మద్యం విక్రయాలను అరికట్టాలన్నారు.
- విద్యుత్ చార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై కూటమి సర్కార్ మోపడం దారుణమన్నారు. ట్రూ అప్ చార్జీల పద్ధతిని, వ్యవసాయ మోటర్లకు మీటర్ల, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాలను రద్దు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు జి.ఓబుళు, కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్రకుమార్, బాలరంగయ్య, సభ్యులు రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, నాగమణి, జగన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు'



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమారి

రాప్తాడు: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై సమగ్ర విచారణ చేసి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎవరైనా సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ చెన్న కేశవులు, ఆర్ఐ రాగే కరుణాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సౌకర్యాల కల్పనకు చర్యలు



శిల్పారామం పరిసరాలను పరిశీలిస్తున్న సీఈఓ స్వామినాయుడు

అనంతపురం రూరల్: శిల్పారామాన్ని సందర్శించే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని శిల్పారామం సీఈఓ స్వామినాయుడు తెలిపారు. బుధవారం అనంతపురం శిల్పారామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్కు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిల్పారామంలో సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. అందుకు అనుగుణంగా సందర్శకులు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. సాధనాల యంత్రాలను కండీషన్‌లో ఉంచుకోవడంతో పాటు తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుల పుస్తకాన్ని సందర్శకులకు అందుబాటులో ఉంచాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న బి.అజితకు బుధవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు పర్యవేక్షణలో ఏ స్టడీ ఆన్ ద ఎఫెక్ట్ ఆఫ్ ఏఐ203 నానో పార్టికల్స్ ఆన్ వర్క్ ఎబులిటీ, స్ట్రెన్త్ అండ్ డ్యూరెబులిటీ, క్యారక్టరైజేషన్ ఆఫ్ హై స్ట్రెన్త్ కాంక్రీట్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

పాస్టర్లకు చెక్కుల పంపిణీ

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలోని ఏసుకృపా మందిరంలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన బుధవారం 53వ సర్వసభ్య సమావేశం జరిగింది. జాయింట్ సెక్రెటరీ పాస్టర్ వి.మనషే దైవ సేవకుల పాటలు పాడి దేవుని నామాన్ని ఘనపరిచారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాస్టర్.పీ మార్కు ఆరాధన జరిపించారు. ముఖ్య ప్రసంగికులు రెవ బెంజిమెన్ దేవుడికి ఎలా సేవ చేయాలో వివరించారు. రెవ బెంజిమెన్ చేతుల మీదుగా పాస్టర్ శాంతవర్ధన్ వైద్యం కోసం రూ.30 వేలు, పాస్టర్ చార్లెస్ నాయక్ కళ్యాణదుర్గం కుమారుడి వైద్యం కోసం రూ.5,600, పాస్టర్ దేవదానం వైద్య నిమిత్తం రూ.3 వేలు, అనంతపురం పాస్టర్లు 21 మందికి రూ.1,000 చొప్పున అందజేశారు.

వీసీని కలిసిన స్కూటా కార్యవర్గం



వీసీ అనితతో స్కూటా అధ్యక్షుడు ప్రొఫెసర్ చిట్టా సురేష్, కార్యవర్గ సభ్యులు

అనంతపురం: నూతన స్కూటా (శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అధ్యాపకుల సంఘం) కార్యవర్గ సభ్యులు ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను వీసీకి విన్నవించారు. కార్యక్రమంలో స్కూటా అధ్యక్షుడు ప్రొఫెసర్ చిట్టా సురేష్, జనరల్ సెక్రెటరీ ప్రొఫెసర్ ఎంవీ శ్రీనివాసన్, ట్రెజరర్ డాక్టర్ ఎం. శ్రీరాములు, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ వి.మాధవి, ఈసీ మెంబర్లు ప్రొఫెసర్ గీతాంజలి, ప్రొఫెసర్ పి.వెంకటరమణ, ప్రొఫెసర్ ఎస్ఆర్ సదాశివా రెడ్డి, డాక్టర్ నరేంద్ర మద్దు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం

- నేటి నుంచి పంపనూరులో 'కార్తీక' ఉత్సవాలు
- అధ్వాన స్థితిలో మరుగుదొడ్లు
- దుర్వాసన వెదజల్లుతున్న ఆలయ ప్రాంగణం
- కూలడానికి సిద్ధంగా ఉన్న రేకుల షెడ్లు



దీపాలు వెలిగించే ప్రదేశంలో అరకొరగా ఉన్న షెడ్లు



ఆలయ గర్భగుడి వద్ద నిలిచిన మురుగు



ఆలయ ప్రవేశ మార్గంలో చెత్తాచెదారం

ఆత్మకూరు: కొలిచిన భక్తుల కొంగు బంగారంగా పేరుగాంచిన పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా.. సౌకర్యాల గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. స్వామిని దర్శించుకునేందుకు ప్రతి ఆది, మంగళవారాలు జిల్లా నలుమూలలు, కర్ణాటక నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఆలయంలో గురువారం నుంచి కార్తీక మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. రూ.లక్షల్లో ఆదాయం ఉన్నా.. ఆలయ అభివృద్ధికి మాత్రం ప్రభుత్వం ఏ మాత్రం సహకరించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇటీవల ఆలయంలో జరిగిన సమావేశంలో మండల స్థాయి అధికారులు అందరూ కలసి కార్తీక మాస ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఆలయంలో సౌకర్యాలు కల్పించ లేదు. ఆలయ ఆవరణలో ఎటు చూసినా చెత్తాచెదారం కనిపిస్తోంది. మురుగు నీరు ప్రవహించడంతో దుర్వాసన వస్తోంది.

నెలకు రూ.3 లక్షల ఆదాయం..

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ప్రతి నెలా దాదాపు రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఇంత ఆదాయం వస్తున్నా ఆలయం అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం ఆలయంలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. గర్భగుడి దగ్గరే మరుగుదొడ్లు కూడా ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు ప్రదక్షిణలు చేసే ప్రదేశంలో మురుగు ప్రవహించడంతో తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఇక మహిళలు మరుగుదొడ్లకు వెళ్లాలంటే అంతే సంగతులు. ఆలయ ప్రాంగణంలో ప్రతి వారం నిమ్మదొప్పులలో మహిళలు పెద్ద ఎత్తున దీపాలు వెలిగిస్తారు. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో వేల సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించడానికి ఆలయానికి వస్తుంటారు. కార్తీక దీపాలు వెలిగించే ప్రదేశంలో ఓ నీటి గుంత ఉండటంతో దుర్వాసన వస్తోంది. అంతే కాకుండా ఆలయంలోకి ప్రవేశించే మార్గంలో మురుగు నిల్వ ఉంటోంది. కార్తీక దీపాలు వెలిగించే ప్రదేశంలో కొన్ని రేకులు, పైపులు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భక్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

నేటి నుంచి ఉత్సవాలు ఇలా..

7వ తేదీన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం, 10వ తేదీన సర్పభూషణ, రుద్ర సహిత సర్ప శాంతి హవనం, 15వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతం, కార్తీక పౌర్ణమి పూజా విశేషాలు, 17వ తేదీన తులసీ దామోదర కల్యాణోత్సవం, జ్వాలా తోరణం, కార్తీక కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయంలో గురువారం నుంచి కార్తీక ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలం కేటాయించాం. ఆలయంలో భక్తులు ఇబ్బంది పడకుండా ప్రతి ఆదివారం మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయిస్తున్నాం. మురుగు నీరు, చెత్త చెదారం లేకుండా ఆలయంలో పారిశుధ్య పనులు చేయిస్తాం. ఆలయాన్ని శుభ్రంగా ఉంచుతాం. మహిళలు దీపాలు వెలిగించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తాం. – బాబు, ఆలయ ఈఓ

ఆసుపత్రి బోర్డు తొలగింపు



మద్యం దుకాణం వద్ద ఆస్పత్రి బోర్డును తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: ఆత్మకూరులో పాత ఆసుపత్రి భవనంలో ప్రస్తుతం కొత్త మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. కాని పాత ఆసుపత్రి బోర్డు అలాగే మద్యం దుకాణానికి ఉండటంతో ఇది ఆస్పత్రినా ? లేక మద్యం దుకాణమా అని అనుమానం వచ్చేది. ఈ నేపథ్యంలో బుధవారం సాక్షి దినపత్రికలో 'ఇచ్చట కిక్కు లభించును..!' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన మద్యం దుకాణ నిర్వాహకులు వెంటనే ఆసుపత్రి బోర్డును తొలగించారు.

గుజరాత్‌కు ఎస్కేయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత

అనంతపురం: గుజరాత్ రాష్ట్రంలోని హేంచంద్రాచార్య నార్త్ గుజరాత్ వర్సిటీ, పఠాన్‌లో ఈనెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ వారం రోజుల పాటు జాతీయ సమైక్యతా శిబిరం నిర్వహించనున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కళ్యాణదుర్గం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కోనంకి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ విభాగం వలంటీర్లు పాల్గొంటారు. ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలు, ఒక ప్రోగ్రాం ఆఫీసర్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత వారిని అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొనే వలంటీర్లు వీరే

బి.అమృత (ఆర్ట్స్ కళాశాల), డి.రాఘవి (కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల), బి.నవ్యశ్రీ (ఎస్కేయూ ఫార్మసీ కళాశాల), ఏ.లోహిత (ఎస్వీ డిగ్రీ కళాశాల), ఎం.సాయి అర్షిత (ఎన్ఎస్‌పీఆర్ డిగ్రీ కళాశాల, హిందూపురం), అబ్దుల్ రెహ్మాన్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాయదుర్గం), టి.మంజునాథ్ (ఎస్‌బీవీవీ డిగ్రీ కళాశాల, హిందూపురం), యు.పవన్ (ఎస్కేపీ డిగ్రీ కళాశాల, గుంతకల్లు), జీకే రఘువర్ధన్ (ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాల, మడకశిర), కే.ధనుష్ (కేహెచ్ డిగ్రీ కళాశాల, ధర్మవరం)

దాడులపై ప్రభుత్వం స్పందించదా?



మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ నీలిమ

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోజు రోజుకూ చిన్న పిల్లలపై అత్యాచారాలు, మహిళలపై దాడులు పెరుగుతున్నాయి. దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని ఎంపీపీ సుబ్బర హేమలత డిమాండ్ చేశారు. బుధవారం వైస్ ఎంపీపీ నీలిమ, ఆత్మకూరు సర్పంచ్ వరలక్ష్మితో కలసి ఆమె విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలో మూడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి, చంపేశారని తెలిపారు. అదే తిరుపతిలో ఓ పదో తరగతి బాలికపై దాడి జరిగిందని గుర్తు చేశారు. సత్యసాయి జిల్లాలో అత్తా కోడలిపై ఐదుగురు అత్యాచారం చేసినా చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమైనట్లు మండిపడ్డారు. రాప్తాడులో ఇటీవల వరిమడుగు, భోగినేపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన మహిళలపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. మూడు రోజుల క్రితం ఆత్మకూరు మండలం బి.యాలేరులో టీడీపీ నేతలు అర్ధరాత్రి మద్యం సేవించి మహిళల మెడల్లో నల్లపూసలు దండలు తెంపి మరీ దాడి చేశారని తెలిపారు. వారు కేసు పెట్టడానికి వెళ్తుంటే.. మాపైనే కేసులు పెడతారా? అని మళ్లీ దాడి చేసిన సంఘటనలు ఈ నియోజకవర్గంలోనే చోటు చేసుకున్నాయని తెలిపారు. మహిళలపై ఇన్ని అరాచకాలు, దాడులు జరుగుతున్నా నిందితులను శిక్షించే విషయంలో ప్రభుత్వం వైఫల్యం చెందుతోందన్నారు.

దిశ చట్టాన్ని పునరుద్ధరించాలి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మహిళల రక్షణకు ప్రవేశపెట్టిన దిశ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దిశ చట్టానికి సంబంధించిన జీఓలను మంత్రి లోకేష్, హోం మంత్రి అనిత కాల్చివేయడం తీవ్ర అన్యాయమని మండిపడ్డారు. అత్యాచారాలు, మహిళలపై దాడులకు పాల్పడిన వారినే వెంటనే కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టు దుర్మార్గం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టు దుర్మార్గమని మేయర్ వసీం ధ్వజమెత్తారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా 90 మంది సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టును తప్పుబడుతూ బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, నరసింహులులతో కలసి విలేకరులతో మాట్లాడారు. హామీలను అమలు చేయకుండా రెడ్ బుక్ రాజ్యాంగం పేరిట రాష్ట్రంలో ప్రజల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్, తదితర హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని ఆరోపించారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం నడుస్తోందా? లేక ఎన్నికల ముందు మంత్రి లోకేష్ చెప్పిన రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందా అని అనుమానం వస్తోందని తెలిపారు. హామీలు అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ సోషయల్ మీడియా కార్యకర్తలు పోస్టులు పెడితే దాన్ని తప్పుబడుతూ అరెస్టు చేయించడం అప్రజాస్వామికం అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎవరినైనా అరెస్టు చేస్తే కచ్చితంగా 41ఏ నోటీసు ఇవ్వాలని గుర్తు చేశారు. కానీ సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చేశారన్నారు. ప్రజాస్వామ్యం దేశంలో వాక్ స్వాతంత్ర్యం లేకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు. పోలీసులు కూడా తమ పరిధి దాటి వెళ్లడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పోలీసులు కూడా ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో నడిస్తే పోలీసు వ్యవస్థపై ఉన్న నమ్మకం పోతుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేసులు నమోదు చేసినంత మాత్రాన ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత తగ్గిపోతుందా అని ప్రశ్నించారు.

శ్రీచైతన్యలో రక్తదాన శిబిరం



ఉద్యోగికి పండు అందజేస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఝాన్సీ జన్మదినం సందర్భంగా బుధవారం స్థానిక కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య పాఠశాలలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల ఉద్యోగులతో పాటు మిత్రులు 126 మంది రక్తదానం చేశారు. శ్రీ చైతన్య స్కూల్స్ ప్రిన్సిపల్స్, కో-ఆర్డినేటర్స్, డీన్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



రాప్తాడు పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు

రాప్తాడు: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రకృతి ప్రాజెక్టు నిర్వాహకురాలు డాక్టర్ సుప్రజ చౌదరి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. చెట్లను విచ్చలవిడిగా నరికి వేయడం వల్ల కాలుష్యం పెరిగిపోయి జీవకోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని పేర్కొన్నారు. మొక్కలను విరివిగా నాటి ప్రతి గ్రామాన్ని ఒక ఉద్యానవనంలా మార్చాలని కోరారు. మొక్కలు నాటి పెంచడం అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. విలువైన మొక్కలను పరిరక్షించుకోకపోతే మనుగడే లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకే తిరుపాలు, సీహెచ్ఓ శివప్రసాద్, ఎల్‌టీ శ్రీధర్ బాబు, ఫార్మసి ఆఫీసర్ మూర్తి, సూపర్‌వైజర్ నరసింహ, ఎంపీహెచ్ఏ గోపాల్, ఏఎన్ఎం అనిత, నాగలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలు



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

రాప్తాడు: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. పురాతన వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ప్రకృతి వ్యవసాయ థిమాటిక్ లీడ్ కమ్యూనికేషన్ స్టేట్ ఆఫీసర్ సురేష్ పేర్కొన్నారు. రైతు సాధికార సంస్థ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఎం.చెర్లోపల్లిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. బీజా మృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, సీడ్ పెలట్రైజేషన్ తయారీ, వీటి వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పురుగు మందులపై ఆధార పడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలని సూచించారు. రైతు సాధికార సంస్థ అధికారుల సూచనలతో రైతులు పంటలు బాగానే పండిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు మంచి ఫలితాలను సాధిస్తున్నారని తెలిపారు. భవిష్యత్‌లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు ఆదరణ పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఎంటీఎల్ భూపాల్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గం అనుసరణీయం

అనంతపురం కల్చరల్: భారత, భాగవతాలు మనిషి కొచ్చే ప్రతి సమస్యకు పరిష్కారమార్గం చూపిస్తాయి. మనోవిజ్ఞాన గ్రంథాలైన వాటిని ప్రతి ఒక్కరూ పఠించాలని ప్రముఖ ప్రవచన కర్త మల్లాది వేంకట రామనాథ శర్మ బోధించారు. నగరంలోని శృంగేరీ శంకర మఠం వేదికగా మూడు రోజులుగా సాగుతున్న 'భాగవత సప్తాహం'లో భాగంగా బుధవారం శ్రీమద్భాగవతంలోని పలు ఘట్టాలను సోదాహరణంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తీక మాసంలో వచ్చే క్షీరాబ్ది ద్వాదశికి ఎంతో విశిష్టత ఉందని తెలిపారు. అదేరోజు రాష్ట్రంలో మరెక్కడా జరగని రీతిలో మహాశివుడికి ప్రీతికరమైన వృషభరాజ కల్యాణం అందరికీ మానసికానందాన్ని కల్గిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహిస్తున్న గోమాత వృషభరాజ కల్యాణోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. శారదా చంద్రమౌళీశ్వరులకు జరిగిన ప్రత్యేక పూజల్లో మఠం మేనేజర్ సత్యప్రసాద్, నాయక్, నిర్వాహకులు విజయ్ సాయి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

అధునాతన అంశాలపై దృష్టి సారించాలి

అనంతపురం: ఆధునిక కంప్యూటింగ్ అంశాలు అయిన సూపర్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ అంశాలపై దృష్టి సారించాలని డాక్టర్ శ్రీనాథ్ (శాస్త్రవేత్త) అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఏఐసీటీఈ సహకారంతో నిర్వహిస్తున్న సదస్సుకు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మిషన్ లర్నింగ్, డీప్ లర్నింగ్ ప్రాథమిక సూత్రాలను పరిగణలోకి తీసుకుని వాటిని ఎలా అమలు చేయాలో వివరించారు.

22 నుంచి మౌనగిరి హనుమద్ క్షేత్రం వార్షికోత్సవం

రాప్తాడు: హంపాపురం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై వెలసిన మౌనగిరి హనుమద్ క్షేత్రంలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకూ ఆలయ వార్షికోత్సవం జరగనుంది. బుధవారం ఆలయ ఆవరణలో వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆలయ నిర్వాహకుడు ఈశ్వరయ్య స్వామి విడుదల చేశారు.

యువత భవిష్యత్తుతో చెలగాటమొద్దు

అనంతపురం అర్బన్: నిరుద్యోగ యువత భవిష్యత్తుతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడడం మానుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. డీఎస్సీ నోటిఫికేషన్‌ను వాయిదా వేయడాన్ని వ్యతిరేకిస్తూ డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.బాలకృష్ణ, ఎస్.నూరుల్లా బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా వేయడంతో నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు. అర్థం లేని సాంకేతిక కారణాలను చూపిస్తూ నోటిఫికేషన్ వాయిదా వేయడం సరికాదన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడితే భవిష్యత్తులో జరిగే ఉద్యమాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. వారంలోగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోతే నిరుద్యోగులతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

అయ్యప్ప ఆలయం వద్ద ఉద్రిక్తత



ధర్నా చేస్తున్న గురుస్వాములు

అనంతపురం కల్చరల్: కొన్నేళ్లుగా వివాదాస్పదంగా మారిన చెరువుకట్ట అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. బుధవారం గురుస్వామి శ్రీకాంత్‌తో పాటూ పలువురు అయ్యప్ప స్వాములు వారి కుటుంబ సభ్యులు ధర్నా చేశారు. శ్రీకాంత్ అనే గురుస్వామిపై ఆలయ కమిటీ సభ్యుడు దాడి చేయడాన్ని నిరసిస్తూ మధ్యాహ్నం వరకు నినాదాలు చేశారు. పోలీసులు వచ్చి ఫిర్యాదు తీసుకుని సర్దిచెప్పడంతో ధర్నా విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1977లో ఎస్వీ చంద్ర, దేవేష్, ప్రభాకరన్ నాయర్, వాసుదేవ నాయర్ అనే మలయాళీలు చెరువు కట్టపై స్థానికులతో కలిసి అయ్యప్ప దేవస్థానాన్ని నిర్మించుకున్నామని తెలిపారు. అప్పటికి జిల్లాలో ఎక్కడా అయ్యప్ప దేవాలయం లేదన్నారు. నాటి నుంచి ఇక్కడే స్థిరపడిపోయిన తమను కాదని కొందరు కమిటీలోకి చొరబడి మొత్తం లాగేసుకున్నారని ఆవేదన చెందారు. అయ్యప్ప స్వామి ఆలయ వ్యవస్థాపకులు ఎవరు అనే దానిపై కోర్టులో కేసు నడుస్తోందని పేర్కొన్నారు. భక్తులుగా ఆలయం బయట కూర్చున్నా దాడికి దిగారన్నారు. డాక్టర్ మౌనిక, మనీషా నాయర్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఏలో వేతన వెతలు

అనంతపురం: జేఎన్‌టీయూఏలో పనిచేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగుల వేతన వెతలు వర్ణనాతీతం. జేఎన్‌టీయూఏలో 400 మంది బోధనేతర ఉద్యోగులు, ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. నెలకు రూ. 6 కోట్ల వరకు జీతాలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రెండు నెలలుగా జీతాలు అందక ఉద్యోగులు నానా ఇబ్బందులు పడ్డారు. మూడో నెల ప్రారంభమైనా నేటికీ జీతాలు అందలేదు. దీంతో అప్పులు ఇచ్చే వారు కూడా కరువై కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారిందంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా ఈఎంఐ, వడ్డీ చెల్లింపులు, గృహ రుణం కంతు, పిల్లల చదువులకు ఫీజుల చెల్లింపు, ఇంటి అద్దె తదితర అంశాలకు డబ్బు సమకూర్చలేక ఇప్పటికే పలువురు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. కనీసం క్రెడిట్ కార్డు ద్వారానైనా నిత్యావసర సరుకులు కొనుగోలు చేద్దామంటే నెలకు మించి చెల్లింపులకు గడువు లేకపోవడంతో ఆ కార్డులను ఉపయోగించాలంటేనే భయపడుతున్నారు. క్రమం తప్పకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వ పెద్దలు.. ప్రస్తుతం ఉద్యోగుల సంక్షేమం పట్టనట్టు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఏదైనా పని త్వరగా కావాలని ఉన్నతాధికారులు పురమాయిస్తే.. సార్ మాకు జీతాలు అందలేదు. వాటిని ఇప్పించండి.. బాగా పనిచేస్తాం అని బాహాటంగానే చిరుద్యోగులు తిరగబడుతున్నారు.